క్లుప్తంగా

మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించిన ఎమ్మెల్యే

మానకొండూర్: మానకొండూర్ మండల కేంద్రానికి చెందిన ఆరెపెల్లి పోచయ్య గుండెపోటుతో మృతిచెందగా అతడి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, సుడా చైర్మన్ జీవీ రామక్రిష్ణారావు పరామర్శించారు. వెంట జెడ్పీటీసీ తాళ్లపల్లి శేఖర్‌గౌడ్, ఎంపీటీసీ ఉండింటి సులోచన శ్యామ్సన్, బీఆర్ఎస్ నాయకులు ఆరెపెల్లి కిరణ్, రామగిరి ఆంజనేయులు, నాయకులు, తదితరులు ఉన్నారు.

తహసీల్దార్‌కు సన్మానం



తహసీల్దార్‌ను సన్మానిస్తున్న నాయకులు

హుజూరాబాద్: హుజూరాబాద్ తహసీల్దార్ కోమల్‌రెడ్డిని శుక్రవారం తెలంగాణ టీచర్స్ యూనియన్ నాయకులు ఘనంగా సన్మానించారు. కోమల్‌రెడ్డికి ఆర్డీవోగా పదోన్నతి లభించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో తెలంగాణ టీచర్స్ యూనియన్ కరీంనగర్ జిల్లా శాఖ అధ్యక్షుడు పోలంపెల్లి ఆదర్శన్‌రెడ్డి రజని, జిల్లా ఉపాధ్యక్షుడు తాళ్ల తిరుపతి, హుజూరాబాద్ మండల శాఖ అధ్యక్షుడు పొద్దుటూరి కిషన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

గొర్రెల కాపర్లకు కవర్లు



కవర్లు అందజేస్తున్న జగన్‌రెడ్డి

గన్నేరువరం: మండలంలోని గుండ్లపల్లిలో గొర్రెల కాపర్లకు ఎంఎస్ఆర్ యువ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం బీజేపీ మానకొండూర్ నియోజకవర్గం కన్వీనర్ ముత్యాల జగన్‌రెడ్డి కవర్లు అందజేశారు. వర్షాకాలంలో కాపర్లు ఇబ్బంది పడొద్దని కవర్లు పంపిణీ చేశామని తెలిపారు. కార్యక్రమంలో రాజేందర్‌రెడ్డి, జగన్మోహన్, పర్శరాములు, రాజు, ఐలయ్య, చంద్రయ్య, బాలయ్య, పంబాల ఐలయ్య, సంపత్, ఎల్లయ్య, రమేష్, గోపాల్, రాము, రాజు, అంజయ్య, మల్లయ్య, కనకయ్య, లచ్చయ్య, తిరుపతి, సమ్మయ్య పాల్గొన్నారు.

ప్రణాళికతో చదవాలి

చొప్పదండి: విద్యార్థులు ప్రణాళికతో చదివితే విజయావకాశాలు మెరుగుపరుచుకోవాలని సామాజిక వేత్త అమిరినేని సందీప్ అన్నారు. పట్టణంలోని వరలక్ష్మి ఫంక్షన్ హాల్‌లో ఇంటర్ విద్యార్థుల ఫ్రెషర్స్ డేలో పాల్గొని మాట్లాడారు. అంకితభావంతో చదివి తల్లిదండ్రులకు, గురువులకు మంచిపేరు తీసుకురావాలని, జీవితంలో ఉన్నత విజయాలను అందుకోవాలని సూచించారు. ఈసందర్భంగా విద్యార్థుల పలు సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో అమిరిశెట్టి రత్నాకర్, గుండేటి వెంకటరమణ, అనిల్‌కుమార్, హరిప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత



చెక్కు అందిస్తున్న గౌడ సంఘం నాయకులు

రామడుగు: మండలంలోని చిప్పకుర్తి గ్రామానికి చెందిన బుర్ర వీరగౌడ్ ఇటీవల తాటిచెట్టు పైనుంచి ప్రమాదవశాత్తు కిందపడి మృతిచెందాడు. ప్రభుత్వం నుంచి మంజూరైన రూ.25 వేలు గౌడ సంఘం నాయకులు శుక్రవారం వీరగౌడ్ కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా తాడి కార్పొరేషన్ చైర్మన్ రవికుమార్ గౌడ్, బీసీ కార్పొరేషన్ చైర్మన్ వెంకటేశం గౌడ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామ అధ్యక్షుడు, చొప్పదండి నియోజకవర్గ సర్వాయి పాపన్న మోకుదెబ్బ గౌరవ అధ్యక్షుడు రాజయ్య గౌడ్, మోకుదెబ్బ గౌడ సంక్షేమ సంఘం జిల్లా యూత్ నాయకులు శ్యామ్ సుందర్, మనోజ్ గౌడ్, శ్రీకాంత్ గౌడ్, మనోజ్, మల్లయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.

నో వర్కింగ్

- దాతల సాయంతో సీసీ కెమెరాలు ఏర్పాటు
- నిఘా నేత్రాలకు జబ్బు
- నిర్వహణ, పర్యవేక్షణ లోపం
- జమ్మికుంటలో వరుస చోరీలు
- తాళం వేసిన ఇళ్లే టార్గెట్
- నేరాల నియంత్రణ సాధ్యమయ్యేనా..?



మడిపల్లి కూడలిలో సీసీ కెమెరాలు

జమ్మికుంట: నేరాల నియంత్రణ కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నామని, ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానమని నిఘా నేత్రాల ఏర్పాటు సందర్భంలో పోలీసులు తెలిపారు. కానీ పర్యవేక్షణ, నిర్వహణ లోపంతో జమ్మికుంట పట్టణం, మండలంలోని ఆయా గ్రామాలలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు పని చేయడం లేదు. ప్రత్యేక పర్యవేక్షణ లేక కెమెరాలు మరమ్మతులకు గురవుతున్నాయి. కొన్ని చోట్ల అక్రమార్కులు బయటపడకుండా ఉండటానికి వీటిని తొలిగించినట్లు తెలుస్తోంది. నిఘా నేత్రాలతో చోరీలు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడేవారి గుండెల్లో గుబులు రేపుతుందనేది వాస్తవం. ఏది ఏమైనా నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలను రిపేర్ చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఎక్కడెక్కడ ఏర్పాటు..

జమ్మికుంట పట్టణం మెయిన్ రోడ్డు, కోరపల్లి రోడ్డు, మడిపల్లి రోడ్డు, ఫ్లైఓవర్ బ్రిడ్జి, హుజూరాబాద్ రోడ్డు, వావిలాల రోడ్డు, తహసీల్దార్ కార్యాలయం రోడ్డు, వీణవంక రోడ్డు తోపాటు పట్టణంలో ముఖ్యమైన కూడళ్లు, మండలంలోని ఆయా గ్రామాల్లో ప్రధాన కూడళ్లు, మెయిన్ రోడ్డుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. పోలీస్ అధికారులు చొరవతో స్వచ్ఛందంగా పట్టణంలోని వ్యాపారులు, నాయకులు, ప్రజలు ఆర్థికసాయం చేశారు. నిఘా నేత్రాలు కొంతకాలం సజావుగా పని చేసినా ప్రస్తుతం పని చేయడం లేదు. మరికొన్ని ధ్వంసమయ్యాయి. పర్యవేక్షణ, పునర్‌వ్యవస్థీకరణ జరగడంలేదు.

దాతల సాయంతో..

పోలీస్ అధికారులు దాతల సాయంతో పట్టణం, మండలంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. పట్టణంలో 60, మండలంలోని గ్రామాల్లో 30 ప్రధాన కూడళ్ల అమర్చారు. కానీ ప్రస్తుతం 10 కెమెరాలు పని చేస్తున్నయనేది తెలుస్తుంది.

వరుస చోరీలు

పట్టణం, మండలంలో వరుస చోరీలు చోటు చేసుకుంటున్నాయి. తాళం వేసిన ఇండ్లను దొంగలు టార్గెట్ చేసుకొని చోరీలకు పాల్పడుతున్నారు.

- ఏప్రిల్ 13వ తేదీన ఓ బజ్జీల బండి యాజమాని ఇంట్లో బంగారం, వెండి, నగదు చోరీ.
- జూన్ 26వ తేదీన శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయలంలో బంగారం, వెండి, హుండీలోని నగదు అపహరణ.
- జూలై 9వ తేదీన మండలంలోని వావిలాల గ్రామ పంచాయతీ పరిధి గోపాల్‌పూర్ గ్రామంలోని ఓ ఇంట్లో బంగారం, వెండి, నగదు దోచుకెళ్లారు.
- జూలై 19వ తేదీన జమ్మికుంట పట్టణంలోని ఓ మహిళ ఇంట్లో బంగారం, వెండి, నగదు చోరీ చేశారు.



జమ్మికుంట ఫ్లైఓవర్ బ్రిడ్జి పక్క రోడ్డులో..

కొరవడిన నిఘా వ్యవస్థ..

ఆరునెలలుగా పట్టణంలో నిఘా వ్యవస్థ వైఫల్యమైందని ఆరోపణలు వస్తున్నాయి. పట్టణంలో మంగళవారం వారసంత జరుగుతుంది. పట్టణం, గ్రామాల నుంచి వందలాది మంది కూరగాయలు, సరుకులు, ఇతర వస్తువులు కొనుగోలు చేస్తుంటారు. ఈ క్రమంలో సెల్‌ఫోన్లు చోరీకి గురైన సంఘటనలు అనేక ఉన్నాయి. అత్యాధునిక టెక్నాలజీ వ్యవస్థ ఉన్నా పట్టణంలో వరుస చోరీలు జరుగుతున్నాయి. పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక నిఘా వ్యవస్థ కొరవడింది. సీసీ కెమెరాల మరమ్మతులు చేపట్టి, నిఘా పెంచాలని, చోరీలు జరగకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

బహుజన రణభేరి పోస్టర్ ఆవిష్కరణ



మధురానగర్ చౌరస్తాలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న బీఎస్పీ నాయకులు

గంగాధర: చొప్పదండి మండల కేంద్రంలో ఆగస్టు 6వ తేదీన బీఎస్పీ ఆధ్వర్యంలో నిర్వహించే నియోజకవర్గ స్థాయి బహుజన రణభేరి సభ విజయవంతం చేయాలని నియోజకవర్గ ఇన్‌చార్జి మంద రవీందర్ పిలుపునిచ్చారు. మండలంలోని మధురానగర్ చౌరస్తాలో శుక్రవారం మండల అధ్యక్షుడు పొత్తూరి సురేశ్, నియోజకవర్గ అధ్యక్షుడు నల్లాల రాజేందర్ ఆధ్వర్యంలో పోస్టర్ ఆవిష్కరించారు. బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ హాజరయ్యే రణభేరి సభలో నియోజకవర్గం అభివృద్ధి కోసం పలు తీర్మానాలు చేయనున్నామని, అన్నివర్గాల ప్రజలు తరలి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు రాజు, సురేశ్, సతీశ్, మునీశ్‌రావు, మహేశ్, గణేశ్, కిషన్, శంకర్ తదితరులున్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

హుజూరాబాద్: విద్యారంగ సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని కోరుతూ ఆగస్టు 1 నుంచి 11వ తేదీ వరకు నిర్వహించే విద్యార్థి చైతన్య మహాపాదయాత్రను విజయవంతం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గజ్జల శ్రీకాంత్ కోరారు. శుక్రవారం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వసతులు కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. విద్యా రంగ సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చేందుకే పాదయాత్రను నిర్వహిస్తున్నామని విద్యార్థి సంఘ నాయకులు భారీగా తరలిరావాలని కోరారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు పొలిశెట్టి అఖిలాశ్, జిల్లా కమిటీ సభ్యులు సందీప్, నాయకులు అభినవ్, కార్తికేయ, ప్రేమ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి గజ్జెల శ్రీకాంత్

ఆసుపత్రిలో పండ్లు పంపిణీ



హుజూరాబాద్: పట్టణంలోని ప్రాంతీయ ఆసుపత్రిలో శుక్రవారం బీజేపీ నాయకులు రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే ఈటల రాజేందర్‌జమున దంపతుల వివాహ వార్షికోత్సవం పురస్కరించుకొని నిర్వహించిన కార్యక్రమంలో నాయకులు ప్రభాకర్, వేణు, రాజు, శశిధర్, సంజీవ్, వాసు, సంజీవరెడ్డి, సంపత్, సారయ్య, సమ్మయ్య, చంద్రిక విజయ్, సదయ్య, హృతిక్, వెంకటేష్, సందీప్, సంతోష్, దేవేంద్ర, లక్ష్మి, రేణుక, రమాదేవి, రజిత, అనిత తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి



చేపలను పరిశీలిస్తున్న సుడా చైర్మన్

మానకొండూర్: రాష్ట్ర ప్రభుత్వం మత్స్యకారుల అభివృద్ధికి కృషి చేస్తోందని సుడా చైర్మన్ జీవీ రామకృష్ణారావు అన్నారు. మానకొండూర్ పెద్ద చెరువును శుక్రవారం సందర్శించి మత్స్యకారులతో మాట్లాడారు. ప్రభుత్వం ఉచితంగా చేపపిల్లలు పంపిణీ చేస్తుండటంతో మత్స్యకారులకు ఎంతో మేలు జరుగుతుందని, ప్రభుత్వం ఇచ్చే అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వెంట మత్స్య సహకార సంఘం మానకొండూరు గ్రామ శాఖ అధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు పిండి సందీప్, ఎద్దు సతీష్, అనవేని రాజు, గడ్డం సంపత్, గొల్ల శ్రీనివాస్, తాళ్లపల్లి శేఖర్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

వలస కూలీలకు వైద్య పరీక్షలు



వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్ సనా జవేరియా

జమ్మికుంట: మండలంలోని వావిలాల వద్ద మానేరులో చిక్కుకున్న జార్ఖండ్ వలస కూలీలకు హుజూరాబాద్ డిప్యూటీ డీఎంహెచ్‌వో చందు, వావిలాల పీహెచ్‌సీ డాక్టర్ సనా జవేరియా ఆధ్వర్యంలో శుక్రవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. వావిలాల గ్రామంలో పునరావాస కేంద్రం ఏర్పాటు చేసి 81 మందికి పరీక్షలు, మందుల అందించారు.

ఘనంగా వరల్డ్ హెపటైటిస్ డే ..

డాక్టర్ సనా జవేరియా ఆధ్వర్యంలో శుక్రవారం ప్రపంచ హెపటైటిస్(కాలేయ వ్యాధి) డే నిర్వహించారు. హెపటైటిస్ బారిన పడకుండా జాగ్రత్తలను వివరించారు. మద్యం సేవించడం, జంక్‌ఫుడ్, కొవ్వు పదార్థాలకు దూరంగా ఉండాలని, పోషకాలుండే గింజలు, పప్పులను తీసుకోవాలని, శారీరక వ్యాయామం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శ్రీలత, ఎంపీటీసీ మల్లేశం, ఎంపీవో సతీష్‌రావు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ శంకర్ రెడ్డి, హెల్త్ ఎడ్యుకేటర్ రవీందర్‌గౌడ్, సూపర్‌వైజర్స్ స్వరూప, సదానందం, ఆరోగ్యశాఖ సిబ్బంది స్వప్న తదితరులు పాల్గొన్నారు.

మసీదు పునర్నిర్మాణానికి శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న బాలచందర్ దంపతులు

చిగురుమామిడి: మండలంలోని సుందరగిరిలో మసీదు శిథిలావస్థకు చేరుకోవడంతో గ్రామానికి చెందిన రిటైర్డ్ ఇంజినీర్ జేరిపోతుల బాలచందర్ జయశ్రీ దంపతులు పునర్నిర్మాణానికి ముందుకువచ్చారు. శుక్రవారం పీరీలను నిలబెట్టిన చోట సర్పంచ్ శ్రీమూర్తి రమేశ్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ తిరుపతి, ఉపసర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, వార్డు సభ్యులు సంజీవ్‌కుమార్, దిలీప్‌కుమార్, కాశవేని నర్సయ్య, రాజయ్య, చిన్న చంద్రయ్య, రామోజు కృష్ణమాచారి, ఎనగందుల రాజయ్య, ఫకీర్‌పాషా తదితరులు పాల్గొన్నారు. గ్రామస్తులు మసీదు నిర్మించేందుకు ముందుకు వచ్చిన దంపతులను శాలువా కప్పి ఘనంగా సన్మానించారు.

రైతు బీమాకు దరఖాస్తు చేసుకోవాలి

హుజూరాబాద్‌రూరల్: అర్హులైన రైతులు బీమా పథకానికి దరఖాస్తు చేసుకోవాలని వ్యవసాయ సహాయ సంచాలకులు సునీత శుక్రవారం ప్రకటనలో తెలిపారు. రైతుబీమా పథకం 2023 సంవత్సరానికి 18 జూన్ 2023 వరకు పట్టా పాస్‌బుక్కులు వచ్చిన రైతులు ఏవో వద్ద సంబంధిత ధ్రువీకరణ పత్రాలు సమర్పించాలని సూచించారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

ఎమ్మెల్యే సుంకె రవిశంకర్



రామడుగు: వంతెనను పరిశీలిస్తున్న ఎంపీపీ కవిత, అధికారులు

గంగాధర: భారీ వర్షాలకు గ్రామాల్లోని చెరువులు, కుంటలు నిండి, వాగులు పొంగి పొర్లుతున్నాయి, మరో 48 గంటల పాటు వానలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు ఇబ్బందులకు గురి కాకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అధికారులకు సూచించారు. గంగాధర, బోయినిపల్లి మండలాలకు చెందిన రెవెన్యూ, పోలీస్, విద్యుత్ శాఖ అధికారులతో శుక్రవారం టెలికాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. అధికారులు ముందు జాగ్రత్తలు తీసుకోవడంతో ఇప్పటివరకు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోలేదన్నారు. నష్టపోయినవారి వివరాలు సేకరించాలని సూచించారు. ఇండ్లు కూలిన బాధితులకు గృహలక్ష్మి పథకం అందిస్తామన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

గంగాధర: మండలంలోని హిమ్మత్‌నగర్ గ్రామంలో వరదనీరు ఇండ్లలోకి చేరటంతో ఇబ్బందులకు గురైన బాధిత కుటుంబాలకు శుక్రవారం బీజేపీ దళిత మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి జాడి బాల్‌రెడ్డి నిత్యావసర సరుకులు అందజేశారు. వర్షాలకు ప్రజలు ఇబ్బందులపాలవుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. బాధితులకు రూ. 20 వేల చొప్పున ఆర్థికసాయం అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వెంట నాయకులు పెరుక శ్రావణ్‌కుమార్, కోల అశోక్, రేండ్ల శ్రీనివాస్, సర్వు శ్రీనివాస్, నాగుల వెంకటేశ్, పెద్ది వీరేశం, దయ్యాల ప్రణయ్, ఆకుల మనోహర్, వొడ్నాల రాజు తదితరులు ఉన్నారు.

గండి పరిశీలన

శంకరపట్నం: మండలంలోని కల్వల ప్రాజెక్టు మత్తడి వద్ద ఏర్పడిన గండిని శుక్రవారం డీసీసీ అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ పరిశీలించారు. మత్స్యకారులు, రైతులతో మాట్లాడారు. వెంట మాజీ జెడ్పీటీసీ శ్రీనివాస్‌గౌడ్, మ ండల అధ్యక్షుడు బస్వయ్య తదితరులు ఉన్నారు.

మరమ్మతులు చేపట్టండి

రామడుగు: రామడుగు వంతెనపై తాత్కాలిక మరమ్మతులు చేపట్టి రాకపోకలు యథావిధిగా పునరుద్ధరించాలని ఎంపీపీ కలిగేటి కవిత అధికారులకు సూచించారు. వారం రోజులుగా కురిసన వర్షాలతో కుంగిన వంతెన ప్రాంతాన్ని శుక్రవారం పరిశీలించారు. ఎంపీడీవో భాస్కర రావు, మండల ప్రత్యేకాధికారి ప్రియదర్శిని, ఎస్సై తోట తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

జమ్మికుంట: మండలంలోని మాచనపల్లి గ్రామం నుంచి అబాది జమ్మికుంట, మాచనపల్లి నుంచి ఎండ్లపల్లి వైపు వెళ్లే రోడ్లు భారీ వర్షాలకు తెగిపోయాయి. దీంతో రాకపోకలు నిలిచిపోయాయని, వెంటనే మరమ్మతు చేయాలని శుక్రవారం బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకులు పర్లపల్లి నాగరాజు ఉన్నతాధికారులను కోరారు. జమ్మికుంటకు రాకపోకలు నిలిచి పోవడంతో ఆయా గ్రామాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.



గంగాధర: హిమ్మత్‌నగర్‌లో సరుకులు అందిస్తున్న జాడి బాల్‌రెడ్డి

రాజు మృతి కాంగ్రెస్ పార్టీకి తీరని లోటు



జీల రాజు(ఫైల్)

గన్నేరువరం: గన్నేరువరానికి చెందిన యూత్ కాంగ్రెస్ నాయకుడు జీల రాజుయాదవ్ మృతి కాంగ్రెస్ పార్టీకి తీరని లోటు అని డీసీసీ అధ్యక్షుడు, మానకొండూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. గుండెపోటుతో గురువారం కరీంనగర్‌లో మృతి చెందాడు. మృతదేహాన్ని శుక్రవారం గ్రామానికి తీసుకురాగా పార్టీ జెండా కప్పి నివాళి అర్పించి అంతిమయాత్రలో పాల్గొన్నారు. అంత్యక్రియలకు పలువురు నాయకులు, ప్రజాప్రతినిధులు ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో ఆయా పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం



మానకొండూర్: భారీ వర్షాలకు మండలంలోని ముంజంపల్లి శివారులో కరీంనగర్–వరంగల్ ప్రధాన రహదారిపై రావిచెట్టు నేలవాలడంతో రాకపోకలు నిలిచిపోయాయి. పోలీసులు చెట్టును జేసీబీ సహాయంతో పక్కకు తొలగించారు. రాత్రి వేళ పక్కకు తొలగించిన చెట్టుతో ప్రమాదం పొంచి ఉందని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చెట్టును అక్కడి నుంచి తీసివేయాలని డిమాండ్ చేస్తున్నారు.



బతుకమ్మ ఆడుతూ నిరసన తెలియజేస్తున్న జీపీ కార్మికులు



సంఘీభావం తెలుపుతున్న నాయకులు

జమ్మికుంట: పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయం ఎదుట గ్రామ పంచాయతీ సిబ్బంది, కార్మికుల జేఏసీ ఆధ్వర్యంలో చేస్తున్న సమ్మె కొనసాగుతోంది. శుక్రవారం లో పట్టణంలోని గాంధీ చౌక్ వద్ద సమ్మెలో పాల్గొన్న జీపీ కార్మికులు బతుకమ్మ ఆడి నిరసన తెలిపారు. ఈసందర్భంగా హమాలీ సంఘం అధ్యక్షుడు గుంటి సామ్రాజ్యం మద్దతు తెలిపి మాట్లాడారు. కరోనా సమయంలో ప్రాణాలను సైతం లెక్క చేయకుండా పని చేశారని, ప్రభుత్వం ఎంత చేసినా తక్కువే అవుతుందన్నారు. సీఎం కేసీఆర్, రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకొని సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

రామడుగు: మండల కేంద్రంలో గ్రామ పంచాయతీ కార్మికులు చేస్తున్న సమ్మె 23 రోజుకు చేరుకుంది. శుక్రవారం ఎమ్మార్పీస్ జిల్లా అధ్యక్షుడు బెజ్జంకి అనిల్, ఎంఎస్పీ చొప్పదండి నియోజకవర్గ ఇన్‌చార్జి తడగొండ శంకర్, మండల అధ్యక్షుడు గజ్జెల స్వామి, షానగర్ మాజీ ఉపసర్పంచ్ తోట రవి, నాయకులు దాసరి రవిశాస్త్రి, ఇందుర్తి ప్రవీణ్ తదితరులు సమ్మెకు సంఘీభావం తెలిపారు. ప్రభుత్వం వెంటనే గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.